క్లుప్తంగా

ఉపాధి హామీపై గ్రామ సభలు



కాళీపట్నం తూర్పులో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ మల్రెడ్డి

మొగల్తూరు: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై గురువారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను రిసోర్స్ పర్సన్ మల్రెడ్డి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడమే కాకుండా ఉపాధి కూలీలు చేసిన పని వివరాలను, పనిదినాలకు సంబంధించిన వేతనాలు అందాయో?లేదో? అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కాళీపట్నం తూర్పు, పడమర, మొగల్తూరు.పేరుపాలెం నార్త్, సౌత్, రామన్నపాలెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

రెండు రోజుల పాటు సీపీఎం రాష్ట్రస్థాయి సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్

నరసాపురం: నరసాపురంలో సీపీఎం రాష్ట్రస్థాయి సమావేశాలను ఈ నెల 26,27 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ చెప్పారు. గురువారం స్థానిక మీరా భవన్‌లో నిర్వహి/ంచిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వాయిదాపడ్డ సమావేశాలను 26,27 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జల్లి రామ్మోహన్, తెలగంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వివరిస్తున్న అపుస్మా సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో మరింత అవగాహన పెరగడానికి వ్యాసరచన పోటీలు ఎంతగానో దోహదపడతాయని పట్టణ అపుస్మా సెక్రటరీ శ్రీరామ్ తెలిపారు. ఈ నెల 15న పట్టణంలో జరగనున్న సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులకు వివిధ అంశాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మరింత పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అపుస్మా ప్రెసిడెంట్ షాజహాన్, ట్రెజరర్ భానుప్రకాష్, రావూరి అప్పారావు, జానకిరామ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మెప్మా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన మహిళను గుర్తించి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను మార్కెట్‌లో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మెప్మా అధికారులు సీహెచ్ మోహన్, ఎంవీవీ సత్యనారాయణ, ఆర్.షణ్ముఖదేవి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లు

నరసాపురం: నరసాపురం నుంచి జనవరి 15, 22, 17, 24 తేదీల్లో శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం నరసాపురం–కొల్లం మధ్య ప్రత్యేకరైళ్లు నడుపుతున్నట్టు నరసాపురం స్టేషన్ మేనేజర్ ఎం.మధుబాలు గురువారం విలేకరులకు చెప్పారు. వచ్చే నెల 15, 22 తేదీన రాత్రి 9 గంటలకు నరసాపురంలో బయలుదేరి విజయవాడ, గుంటూరు మీదుగా వెళ్లి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు కొల్లం చేరుకుంటుందని వివరించారు. మళ్లీ తిరుగు ప్రయాణంలో వచ్చేనెల 17,24 తేదీలు శుక్రవారాల్లో కొల్లంలో ఉదయం 06.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు శనివారాల్లో సాయంత్రం 6.30 గంటలకు నరసాపురం చేరుకుంటాయని చెప్పారు.

రైతులకు భరోసా ఏదీ?

రైతుల పంట దళారుల పాలు



తూర్పుపాలెంలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు (ఫైల్)

పెనుగొండ/నరసాపురం రూరల్: రైతులక అండగా ఉండాల్సిన ప్రభుత్వం దళారుల పెత్తనాన్ని చోద్యం చూస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుండంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ధర ప్రకారం 75 కేజీలు రూ.1725 మద్దతు ధర ఉండగా, రూ.1525 చెల్లిస్తున్నారు. దీంతో రైతు దాదాపుగా రూ.10 వేలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడతుంది. ఇప్పటికే సాగు ప్రారంభం తర్వాత రెండు తుఫాన్లు, వరదల తాకిడితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆచంట వేమవరం, వల్లూరు, పెనుమంట్ర మండలంలో కొన్ని గ్రామాల్లో రైతులు రెండు పర్యాయాలు నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో తేమ శాతం, తుపాన్‌లతో మరింత నష్టపోతారంటూ దళారులు రైతును మభ్య పెడుతుండడంతో తప్పని పరిస్థితుల్లో దళారులకు బలవుతున్నారు. దళారులు మాత్రం దర్జాగా రైతు సేవా కేంద్రం ద్వారా వారు పూర్తి ధర పొందుతున్నారు. ఇది బహిరంగంగా జరుగుతున్నా ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు

పెట్టుబడి సాయం నిల్

గత ప్రభుత్వంలో రైతులకు అండగా ఉండడానికి పెట్టుబడిలకు గానూ రైతు భరోసాతో ప్రతీ ఏటా ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, పోడూరు, పెనుమంట్ర, ఆచంట మండలాల్లోని 21 వేల మందికి పైగా రైతులకు పెట్టుబడి సాయం జమ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకూ జమ చేయక పోవడంతో రైతులు పెట్టుబడులు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. వడ్డీ వ్యాపారులే పంట చేతికొచ్చిన తరువాత దళారులుగా అవతారం ఎత్తుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులను ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

బీమా భారం రైతులదే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సాయం చేయాల్సింది పోయి వారే పంటల బీమా సొమ్మును చెల్లించాలని మెలికపెట్టింది. రబీలో సాగు చేసిన పంటలకు రైతులే బీమా చేయించు కోవాలని ఆయా పంటలకు నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అన్నదాతలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ క్రాఫ్ చేయించుకుంటే చాలు ఒక్క రూపాయి కూడా ఖర్చులేకుండా పంట బీమా వర్తింప చేసి పకృతి విపత్తుల వల్ల పంట నష్టం జరిగినప్పుడు రైతు మంగిటకే పరిహారం అందించిన సందర్భాలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే నరసాపురం నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 7500 మంది వరిసాగు చేసే రైతులు, 1,100 మంది ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం రూ.29 కోట్లు చెల్లిస్తే రాష్ట ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రూ.38.12 కోట్లు చెల్లించింది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద నాలుగు తుఫాన్‌లకు పంట దెబ్బ తిన్న సందర్భాల్లో అదే పంట కాలం పూర్తి కాకుండానే రూ6.18కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. రెండు సార్లు పంట నష్టపోయిన సందర్భాల్లో రెండు దఫాలుగా రూ.13.06 కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండగా ఉండేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. విత్తు నుంచి దిగుబడి, విక్రయం వరకూ అంతా ప్రభుత్వమే చూసుకునేదని గత ప్రభుత్వాన్ని రైతులు ప్రశంసిస్తున్నారు.

దళారుల నుంచి రక్షించాలి



రైతులు కష్ట పడి పండిస్తున్న పంట దళారుల పాలవుతుంది. ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంటుంది. కష్టించేది ఒకరు లాభ పడేది మరొకరు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని రైతులను రక్షించాలి.

– ఎస్ వెంకటేశ్వరరావు, పెనుగొండ

బీమాతో అదనపు భారం



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా పంటల బీమీ సొమ్ములు రైతులే చెల్లించు కోవాలంటూ వారిపై అదనంగా భారం వేయడం దుర్మార్గం. ఇప్పటికే అకాల వర్షాల వల్ల రైతులకు అపారనష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి. రబీలో సాగు చేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలని చెప్పడం రైతులను మోసం చేసినట్లే అవుతుంది.

– కొత్తపల్లి బాబీ, రైతు, శేరేపాలెం

భీమవరం తరలిరావాలి

పెనుమంట్ర: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సారధ్యంలో అన్నదాతకు అండగా నిర్వహించే నిరసన కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు కోరారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు.

వారతిప్పలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఒ.,దినేష్ కోరారు. మొగల్తూరు మండలంలోని వారతిప్ప గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సుమారు 52 మంది రోగులను పరీక్షించగా 12 మందికి బీపీ, షుగర్ ఉన్నట్లు గుర్తించి వారికి ఆరోగ్య సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కృపారూత్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



నరసాపురం రూరల్: శిక్షణ ఇస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి



మొగల్తూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రిశూల పాణి



పెనుగొండ: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి

నరసాపురం రూరల్: గ్రామాల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వ శాఖల సిబ్బంది ఒక లక్ష్యంతో పని చేయాలని ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి పంచాయతీలలో చేపట్టాల్సిన విధి విధానాల గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్ విశ్వనాథ్, ఈఓపీఆర్డీ కె.నాగేంద్రకుమార్, ఏపిఎంనాగభూషణ నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: రాబోయే తరాలకు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలను సాదించేందుకు మనకు ఉన్న వనరులను ఆందించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై రెండు రోజులు పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించగలుగుతామని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం పెనుగొండ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికరణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని కోరారు.

ఆచంటలో

ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికరణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

నూరు శాతం సోలార్ వినియోగిస్తే రూ.కోటి నజరానా



ఆగర్తిపాలెంలో సోలార్ ప్యానెల్‌పై అవగాహన కల్పిస్తున్న ఎలక్ట్రికల్ ఎస్ఈ ఆలపాటి రఘునాధబాబు

పాలకొల్లు అర్బన్: గ్రామంలో నూటికి నూరుశాతం సోలార్ మీటర్లు వినిగిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానా అంజేస్తుందని ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆలపాటి రఘునాధబాబు వెల్లడించారు. నరసాపురం డివిజనల్‌లో మోడల్ గ్రామంగా ఎంపికి చేసిన ఆగర్తిపాలెంలో గురువారం సోలార్ మీటర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో సోలార్ విద్యుత్ వినియోగం వల్ల ఎలక్ట్రికల్ బిల్లులు తగ్గుతాయన్నారు. అలాగే కేంద్రప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఇంటింటికీ తిరిగి సోలార్ మీటర్లపై అనుమానాలను నివృత్తి చేసి సుమారు 15 మంది లబ్ధిదారులకు సోలార్ మీటర్లు రిజిస్ట్రేషన్‌లు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మీకుమారి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేడిది జాన్ డేవిడ్‌రాజు, నరసాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికులను వేధిస్తున్న రైల్వే అధికారులు



ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉంచిన గూడ్సు రైలు

ఉండి: రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల పాలిట రైల్వే అధికారుల తీరు వింతగా ఉంది. వారిని వేధిస్తూ అధికారులు తమ సౌలభ్యం చూసుకుంటున్నట్లుంది. ప్రయాణికులు ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యమే తమకు ముఖ్యమని చెప్పే అధికారులు ప్రయాణికులను వేధింపులకు గురి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఉండి రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. మొదటి ప్లాట్‌ఫాంపై భీమవరం వైపుకు వెళ్లే రైళ్లు ఆగుతాయి. రెండో ప్లాట్‌ఫామ్‌పై విజయవాడ వైపు వెళ్లే రైళ్లు ఆగుతాయి. అయితే గత కొంతకాలం నుంచి రైల్వే అధికారులు ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఏదైనా పాతరైలు భోగీలు, రైళ్లు లేదా ట్రాక్ రిపేరుకు వెళ్లే ట్రైన్ లేదా గూడ్సు రైలును రోజుల తరబడి నిలిపి ఉంచుతున్నారు. దీంతో విజయవాడ నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారిలో అధికంగా రోగులు, వృద్ధులు, మహిళలు మరితంగా ఇబ్బందికి గురవుతున్నారు. చాలా ఎత్తులో ఉండే ఫుట్‌పాత్ బ్రిడ్జ్‌ను ఎక్కి రావాలంటే వృద్ధులు, రోగులు చాలా ఆవేదన చెందుతున్నారు. ఇదే విధంగా చాలాసార్లు రైళ్లు నిలిపి ఉంచడంతో ప్రయాణికులు ఇబ్బందులు రెట్టింపయ్యాయి. దీనిపై ఉండి రైల్వే ప్రయాణికుల సంఘ కార్యదర్శి సీహెచ్ బంగార్రావు స్పందించారు. ఈ విషయాన్ని చాలా సార్లు స్టేషన్‌మాస్టర్, రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి స్పందన కరువైందన్నారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్ ఇనిటేటివ్ పథకంలో భాగంగా సోలార్ పీవీ ప్రాజెక్టు హెల్పర్ రెండు నెలల స్వల్పకాలిక కోర్సులో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. ఐదో తరగతి నుంచి ఆపై పాసై 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీతో రిజిస్ట్రేషన్ల గడువు ముగిస్తుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9676099988 నెంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాసరాజు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి పంచాయతీ సొమ్మును సొంతానికి వాడుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సర్పంచ్ బందా విజయ తన భర్తతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కాళ్ల పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈవోపీఆర్డీ ఎంవీ భాస్కరరావు సమక్షంలో చేపట్టిన విచారణలో మాజీ కార్యదర్శి శివాజీ తాను ఏ విధమైన అవినీతికి పాల్పడలేదంటూ తాను చేసిన పనులకు సంబంధించి బిల్లులను సమర్పించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ కాళ్ల మండలం పర్యటన సందర్భంగా యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులను చేపట్టామన్నారు. పంచాయతీ పరిధిలో జేసీబీ, ట్రాక్టర్లు, ఎస్ఎంఆర్ కూలీల సహకారంతో 2022 మే నుంచి జూలై వరకు పనులు నిర్వహించామని తెలిపారు. దీనిలో భాగంగా ఎవరెవరికి ఎంతెంత చెల్లించామనేది అధికారుల కౌంటర్ సంతకాలు, సప్లై దారుల సంతకాలు, ఎన్ఎంఆర్ అటెండెన్స్ అన్నీ సమర్పించినట్లు తెలిపారు. సదరు రిపోర్టు అంశాలను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఈఓపీఆర్డీ స్పష్టం చేశారు.

జోరుగా మాసూళ్లు



మల్లవరంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న దృశ్యం



తామరాడలో చిరుజల్లులతో దిగబడిపోతున్న కోత మెషీన్లు

తుఫాన్ హెచ్చరికలతో ఆందోళనలో అన్నదాత

పెనుగొండ/నరసాపురం రూరల్: ఫెంగల్ తుఫాన్ నుంచి బయట పడడంతో రెండు రోజుల నుంచి రైతులు వరి మాసూళ్లు జోరుగా సాగిస్తున్నారు. మళ్లీ మరో తుఫాన్ తాకిడి ఉందన్న విస్తృత ప్రచారంతో రైతుల్లో గుబులు రేపుతుంది. ఫెంగల్ తుపాన్‌లో కోతలు చేయవద్దంటూ అధికారులు ప్రకటించడంతో వారం రోజులపాటు కోతలు నిలిపి వేశారు. తుఫాన్‌కు ముందు ఆచంట నియోజకవర్గంలో కేవలం పది శాతం లోపు మాత్రమే కోతలు కోశారు. వాటిని రైతులు మిల్లులకు చేర్చుకొని నష్టం లేకుండా బయటపడ్డారు. అక్కడక్కడా నేలకొరిగిన వరి పనలు తప్ప భారీగా నష్టం వాటిల్లలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలిస్తున్నా, మధ్యమధ్యలో మబ్బులు పడుతూ భయపెడుతుంది. దీంతో సాధ్యమైనంత త్వరగా కోతలు పూర్తి చేయడానికి రైతన్నలు ముందుకు వస్తున్నారు. దీంతో కోత మెషీన్లు ఇబ్బంది తలెత్తినా, రైతులు నిర్వాహకులు వెంట పడి మరీ కోతలు పూర్తి చేసుకుంటున్నారు. ఆది, సోమవారాల్లో కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. దీంతో నేల చిత్తడిగా మారింది. చిత్తడిగా మారిన ప్రాంతాల్లో కోతకు అదనంగా మరో రెండు వేల రూపాయల వరకూ ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా వెనుకంజ వేయకుండా కోతలు పూర్తి చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లోపు కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఒబ్బిడి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 10015 ఎకరాల్లో సాగుచేస్తుండగా 3740 ఎకరాల్లోనూ, పోడూరు మండలంలో 12790 సాగు చేస్తుండగా 5500 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 11750 సాగు చేస్తుండగా 9100 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12156 సాగు చేస్తుండగా 8150 ఎకరాల్లో కోతలు పూర్తి చేశారు. కోతలు పూర్తి కాగానే ధాన్యం తేమ శాతం తగ్గించుకోవడానికి రహదారులనే కల్లాలుగా చేసుకొని ఆరబెట్టుకొని ఒబ్బిడి చేసుకుంటున్నారు. మరోసారి వాతావరణ ఇబ్బందులకు దొరక్కుండా ముందుకు సాగుతున్నారు.

అదనంగా రూ.2 వేలు ఖర్చవుతుంది



ఫెంగల్ తుఫాన్‌తో మధ్యమధ్యలో పడిన చిరుజల్లులతో కొన్ని ప్రాంతాల్లో నేల చిత్తడిగా మారింది. దీంతో కోత ఆలస్యమవుతుంది. 40 నిముషాల నుంచి రెండు గంటల వరకూ పడుతుంది. దీంతో రెండు వేల రూపాయల వరకూ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది.

– నల్లా నాగేశ్వరరావు, రైతు, వెంకట్రామపురం

మరోసారి దొరక్కుండా..



వాతావరణంలో మార్పులతో వర్షానికి మరోసారి దొరక్కుండా రైతులు కోతలను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే ఈ సీజన్‌లో రెండు, మూడు తుఫాన్లతో దిగుబడులు తగ్గాయి. అయిదారు బస్తాల దిగుబడి తగ్గింది. పాలు తొడిగే సమయంలో వర్షాలు పడడంతో తాలు శాతం పెరిగింది. చేతికందిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి రైతులు కంగారు పడుతున్నారు.

– కానూరి సత్యనారాయణ, రైతు, తామరాడ

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మొగల్తూరు: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను శుక్రవారం మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామాల రైతులు ఈ సదస్సులకు హాజరై భూ సమస్యలపై వినతిపత్రాలను అందించాలని కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి పంచాయతీ పరిధిలో ఈ నెల 13వ తేదీ నుంచి వచ్చే నెల మూడవ తేదీ వరకు మీ భూమి–మీ హక్కు నినాదంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులు ప్రతి రోజు రెండు గ్రామాలలో ఆయా గ్రామ పంచాయతీల వద్ద నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం సభలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం సభలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. శుక్రవారం ఉదయం కంచుస్తంభంపాలెం, మధ్యాహ్నం దొడ్డిపట్ల గ్రామాల్లో నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఆయాలకు జీతాలివ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆయాలు

పెనుగొండ: ఐదు నెలలుగా పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద, ఎంఈఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆయాలు ధర్నా నిర్వహించి, తహసీల్దారు, ఎంఈఓలకు వినతి పత్రాలు సమర్పించారు. జూలై నుంచి ఇప్పటి వరకూ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. రాష్ట ప్రభుత్వం జీతాలు మంజూరు చేశామని చెబుతున్నా నేటికి వేతనాలు రాలేదన్నారు. సత్వరం జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజలపై అదనపు విద్యుత్ భారం వద్దు



వీవర్స్ కాలనీలో విద్యుత్‌బిల్లులపై ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్

పాలకొల్లు అర్బన్: ప్రజలపై అదనపు విద్యుత్ భారం వేయవద్దని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాలకొల్లు పట్టణంలోని పేదల కాలనీల్లో సీపీఎం నాయకులు గురువారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ బిల్లులపై వినియోగదారుల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ బిల్లులు పెంచనని హామీ ఇచ్చి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై రూ.17వేల కోట్లు భారం మోపడంపై ఆయన ప్రభుత్వ తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు, వై అజయ్‌కుమార్, సత్తింశెట్టి పురుషోత్తం, చల్లా సోమేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరం: స్థానిక బార్ అసోసియేషన్ హాల్లో గురువారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కోర్టు టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ సిబ్బందికి క్యాలెండర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.